## క్లుప్తంగా

### అరుణాచలానికి ప్రత్యేక బస్సు సర్వీసు

**తెనాలిఅర్బన్:** పౌర్ణమి సందర్భంగా తెనాలి డిపో నుంచి అరుణాచలానికి ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సును నడపనున్నట్లు ఆర్టీసీ తెనాలి డిపో మేనేజర్ ఎ.రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ బస్సు మే నెల మూడున తెనాలి నుంచి బయలుదేరి శ్రీకాళహస్తి, కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ మీదుగా ఐదో తేదీన అరుణాచలం చేరుకుంటుందని చెప్పారు. తెనాలి పట్టణ, పరిసర ప్రాంతాల్లోని ప్రజలు ఈ సేవలను ఉపయోగించుకోవాలని కోరారు. వీటికి సంబంధించిన రిజర్వేషన్లు కూడా అందుబాటులో ఉన్నాయన్నారు. వివరాలకు తెనాలి డిపోలో సంప్రదించాలని సూచించారు.

### 13న జగ్జీవన్‌రామ్ విగ్రహావిష్కరణ

**తెనాలిఅర్బన్:** మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహావిష్కరణ మహోత్సవాన్ని ఈ నెల 13న తెనాలిలో నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. చెంచుపేట ఇందిరానగర్ కాలనీలో సాయంత్రం నాలుగు గంటలకు జరిగే కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపకులు మంద కృష్ణమాదిగ పాల్గొంటారని చెప్పారు.

### ఆరుగురిపై కేసు

**తెనాలిరూరల్:** బహిరంగ ప్రదేశంలో మద్యం తాగడమే కాకుండా గలాటా సృష్టించిన ఆరుగురిపై పోలీసులు న్యూసెన్స్ కేసు నమోదు చేశారు. తెనాలి మండలం కొలవరం గ్రామం వద్ద ఈనెల 5 అర్ధరాత్రి దాటాక ఆరుగురు వ్యక్తులు రెండు ఆటోల్లో మద్యం తాగడమే కాకుండా, ఆటోలను రోడ్డుకు అడ్డంగా పెట్టి స్థానికులను ఇబ్బందులకు గురి చేశారు. సమాచారం అందుకున్న రూరల్ ఎస్‌ఐ సీహెచ్ వెంకటేశ్వర్లు అక్కడకు వెళ్లి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. రెండు ఆటోలను సీజ్ చేసి వారిపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ శుక్రవారం తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతూ అల్లరి చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ హెచ్చరించారు.

### చందోలులో హరిద్ర శృంగార్చన



**పిట్టలవానిపాలెం:** చందోలు గ్రామంలోని శ్రీ బగళాముఖి అమ్మవారి ఆలయంలో శుక్రవారం హరిద్ర శృంగార్చన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి జి.నరసింహమూర్తి మాట్లాడుతూ బాపట్ల జిల్లా పిట్టలవానిపాలెం మండలం చందోలు గ్రామంలోని బగళాముఖి అమ్మవారి ఆలయంలో ప్రతి శుక్రవారం వివాహం కాని మగపిల్లలకు శీఘ్రంగా పెళ్లి జరిగేందుకు ప్రత్యేకంగా పసుపు కొమ్ములతో హరిద్ర శృంగార్చన నిర్వహిస్తున్నట్టు వివరించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మోదుగుల ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

### రెండువేల మందికి అన్న సంతర్పణ

**పిట్టువారిపాలెం(పిట్టలవానిపాలెం):** శ్రీరామ నవమి ఉత్సవాల ముగింపు సందర్భంగా పిట్టువారిపాలెంలో శుక్రవారం అన్న సంతర్పణ వైభవంగా నిర్వహించారు. 2 వేల మందికి అన్నదానం చేశారు. తొలుత రామాలయంలో సీతారాముల విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు యేట్ర అశ్విని శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

### మోటారు చోరీపై ఫిర్యాదు

**బాపట్లటౌన్:** పట్టణంలోని బెస్తవారిపాలెంకు చెందిన కొలకలేటి రమేష్ అదే ప్రాంతంలో కొత్త గృహం నిర్మించుకుంటున్నారు. ఇంటిని తడుపుకునేందుకు ఏర్పాటుచేసిన నీళ్ళ మోటార్‌ను గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారంటూ శుక్రవారం ఫిర్యాదుచేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్‌ఐ షేక్ రఫీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### ఇద్దరికి గాయాలు

**వినుకొండ (నూజెండ్ల):** రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన ఘటన శివాపురం వద్ద శుక్రవారం తెల్లవారుజామున జరిగింది. కృష్ణా జిల్లా గుడ్లవల్లేరుకు చెందిన పసుమర్తి గాంధీ, పద్మ, ఏడుకొండలు కారులో శ్రీశైలం వెళ్తుండగా మార్గమధ్యంలో లారీ టైరు పంచర్ కావటంతో అదుపు తప్పి కారును ఢీకొట్టింది ఏడుకొండలు, గాంధీలకు గాయాలయ్యాయి.

### రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

**పిట్టలవానిపాలెం:** రోడ్డు ప్రమాదంలో మహిళ మృతిచెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. చందోలు ఎస్‌ఐ రాజశేఖర్ కథనం ప్రకారం.. పిట్టలవానిపాలెం మండలం అల్లూరు శివారు యాదవపాలెం గ్రామానికి చెందిన ఆరాధ్యుల విజయలక్ష్మి (65) గురువారం మధ్యాహ్నం తన మనమడు పూర్ణ నాగశ్రీహర్షతో కలిసి కంటి వైద్యం నిమిత్తం బాపట్లకు స్కూటీపై వెళ్తుండగా అలకాపురం సమీపంలో ఖాజీపాలెం వైపు నుంచి అల్లూరు వైపు వెళ్తున్న ఆటో ఢీకొట్టింది. దీంతో కింద పడిన విజయలక్ష్మి మీదుగా వెనుకనే వస్తున్న ట్రాక్టర్ వెళ్లడంతో ఆమె తీవ్రంగా గాయపడింది. వైద్యశాలకు తీసుకెళ్తుండగా మార్గమధ్యంలోనే ఆమె మృతి చెందింది. మృతురాలి మనవడికి తీవ్ర గాయాలయ్యాయి. చందోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# పాలనలో దేశానికే ఆంధ్ర రోల్‌మోడల్

- 98.5 శాతం హామీలను నెరవేర్చిన సీఎం జగన్ ప్రభుత్వం
- చేసిన పనులు చెప్పకుంటూ మరోసారి మద్దతు కోసం ప్రజల్లోకి
- 'జగనన్నే మా భవిష్యత్' ప్రారంభించిన ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్



యజమాని అనుమతితో ఇంటి గోడకు, ఫోన్‌కు స్టిక్కర్‌ను అంటించి ఇచ్చిన ఎమ్మెల్యే శివకుమార్

**తెనాలి:** ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను, మేనిఫెస్టోలోని నవరత్నాలను అధికారంలోకి వచ్చిన 46 నెలల్లో 98.5 శాతం నెరవేర్చిన ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలోని రాష్ట్ర ప్రభుత్వం సుపరిపాలనలో దేశానికే రోల్‌మోడల్‌గా నిలిచిందని ఎమ్మెల్యే శివకుమార్ చెప్పారు. గత ప్రభుత్వ దుర్మార్గ పాలనను, ప్రస్తుత ప్రభుత్వం తీసుకొచ్చిన సుపరిపాలనను ప్రజలకు వివరించటం, రెండింటి మధ్య వ్యత్యాసాన్ని తెలియజెబుతూ మరోసారి వారి మద్దతును కోరేందుకు ఉద్దేశించిన 'జగనన్నే మా భవిష్యత్– మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమం తెనాలిలో శుక్రవారం ప్రారంభమైంది. పట్టణంలోని 20వ వార్డు పరిధిలోని తులసీరామ్ చౌక్‌లో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ గృహసారథులు, సచివాలయ కన్వీనర్లకు కార్యక్రమ కిట్లను అందజేశారు. అక్కడే విలేకరులతో మాట్లాడారు. ఎక్కడా పార్టీలు, కులమతాల వివక్ష చూపకుండా సంక్షేమ పథకాలతో పేదల ఖాతాల్లో రూ.2 లక్షల కోట్లను నేరుగా జమచేసిన ప్రభుత్వం తమదని గుర్తుచేశారు. రాష్ట్రప్రభుత్వం విప్లవాత్మక సంస్కరణలను అమలుచేస్తూ, ఎన్నో రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందన్నారు. ఇలాంటి తరుణంలో మరోసారి ప్రజల మద్దతు కోరేందుకు ఎక్కడా ఏ పార్టీ ప్రభుత్వం చేపట్టని జగనన్నే మా భవిష్యత్.. కార్యక్రమాన్ని చేపట్టటం విశేషంగా చెప్పారు. నియోజకవర్గంలో 1,400 మంది గృహసారథులు దీనిపై పనిచేస్తారని తెలిపారు. ప్రతి కుటుంబాన్ని సందర్శించటం, వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకుంటూ అవసరమైన సాయం చేయటంపై నిత్యం సమీక్షిస్తుండే గొప్ప కార్యక్రమంగా చెప్పారు. వలంటీరు నుంచి కన్వీనరు వరకు, కౌన్సిలరు నుంచి ఎమ్మెల్యే వరకు ప్రజల బాగోగులను పర్యవేక్షిస్తుండే వ్యవస్థను నడిపించటం అద్భుతమని చెప్పారు. అనంతరం వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లతో కలిసి ఎమ్మెల్యే శివకుమార్ స్వయంగా పలు గృహాలను సందర్శించారు. పార్టీ నిర్దేశించిన ప్రకారం ఒక్కో ఇంటిలో యజమానులను కలిసి, గత ప్రభుత్వం, ప్రస్తుత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పరిపాలనకు వ్యత్యాసాన్ని వివరించారు. కరపత్రాలను అందజేశారు. ప్రజా మద్దతు పుస్తకంలో పేర్కొన్న ఐదు ప్రశ్నలు అడిగి, సమాధానాలు నమోదు చేశారు. ప్రభుత్వానికి మద్దతునిస్తామని చెప్పగానే, వారిచేత అందులోని నంబరుకు మిస్డ్‌కాల్ ఇప్పించారు. ఇంటి యజమానుల అనుమతితో 'జగనన్నే మా భవిష్యత్–మా నమ్మకం నువ్వే జగన్' స్టిక్కర్‌ను ఇంటి గోడకు, మరో స్టిక్కరును వారి ఫోనుకు ఎమ్మెల్యే శివకుమార్ అతికించారు. ఆ క్లస్టరు పరిధిలోని కుటుంబాలను ఎమ్మెల్యే సందర్శించి, ప్రజాసర్వేను పూర్తిచేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్, వైస్‌చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, పట్టణ కన్వీనర్లు తాడిబోయిన రామయ్య, మన్నవ ప్రభాకర్, సచివాలయ కన్వీనర్లు కొల్లా గురునాథగుప్త, దామర్ల విజయరాణి, షేక్ జాకీర్, గృహసారథులు కంభంపాటి అజయ్‌శ్రీరామ్, ఆలపాటి ఉషారాణి, భాస్కరుని లక్ష్మీనారాయణ, కిరణ్, గొంట్ల వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు భాస్కరుని శ్రీనివాసరావు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.




ఓ కుటుంబ సభ్యులతో గత ప్రభుత్వానికి, తమ ప్రభుత్వానికి వ్యత్యాసాన్ని వివరిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

## రేపు సంజీవదేవ్ రసధ్వని ఆవిష్కరణ

**తెనాలి:** కళాతపస్వి డాక్టర్ సంజీవదేవ్ సాహిత్యం–జీవితంపై తాజాగా రూపొందించిన 'రసధ్వని' పుస్తక ఆవిష్కరణ ఆదివారం తెనాలిలో జరగనుంది. కవిరాజ పార్కులోని జీవీకే భవన్‌లో సాయంత్రం 4.30 గంటలకు ఏర్పాటయ్యే సభకు ప్రజాసాహితి సంపాదకుడు కొత్తపల్లి రవిబాబు అధ్యక్షత వహిస్తారు. మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తారు. చైతన్య వేదిక అధ్యక్షుడు డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తి, ప్రముఖ రచయిత ముత్తేవి రవీంద్రనాథ్ వక్తలు. డాక్టర్ సంజీవదేవ్ ఫౌండేషన్, తెనాలి ఆధ్వర్యంలో జరిగే సభను కార్యదర్శి వైవీ రావు పర్యవేక్షిస్తారు.

**రచనా 'సంజీవ'ం**

దాదాపు 24 ఏళ్ల క్రితం కన్నుమూసిన ప్రముఖుడు డాక్టర్ సంజీవదేవ్. తెలుగులో సౌందర్యవాదానికి పూలబాట వేసి విస్తృతంగా రచనలు చేసి, ప్రకృతికీ, పాఠకునికీ మధ్య వారధిగా నిలిచిన రసవేత్త సంజీవదేవ్. నేటితరం ఆయన్ను తెలుసుకోవాలంటే ఆయన రచనలే ఆధారం. తెనాలి–విజయవాడ రోడ్డుమార్గంలోని తుమ్మపూడి సంజీవదేవ్ స్వస్థలం. బడి చదువుల చట్రంలోకి వెళ్లకుండానే స్వేచ్ఛాజీవిగా సంచరిస్తూ ఇష్టమైనవి నేర్చుకుంటూ, అధ్యయనం చేస్తూ అనేక భాషల్లో పాండిత్యం సంపాదించారు. తెలుగు, ఇంగ్లిష్‌లో అనుకరణీయమైన, విలక్షణమైన గద్యశైలి, తార్కిక వాక్య నిర్మాణం, పునరుక్తి రాహిత్యం ఆయన రచనల్లోని ప్రత్యేక లక్షణం. తన సౌందర్య వేదాన్ని సామాన్యులకు అందించటానికి అనేక మాటలను సొంతంగా సృష్టించుకున్నారు. ఒక ప్రత్యేకమైన శైలినీ అలవరచుకున్నారు.




రసధ్వని పుస్తకం

**స్వగ్రామం వదలని మహోన్నత వ్యక్తి**

ఎంతగా ఎదిగినా, ఎన్నినేర్చినా స్వగ్రామం తుమ్మపూడిని సంజీవదేవ్ వదల్లేదు. తన ప్రజ్ఞాపాటవాలతో ప్రపంచమే ఆ గ్రామానికి వచ్చింది. ప్రసిద్ధులెందరికో దర్శనీయ క్షేత్రమైంది. మరెందరో మహానుభావులు లేఖలతో అనుబంధాన్ని పెంచుకున్నారు. లేఖాసాహిత్యం సంజీవదేవ్‌తోనే జాగృతమైంది. చిత్రలేఖనం నేర్చుకుని నీటిరంగుల్లో హృదయాన్ని ఆహ్లాదపరిచే ప్రకృతి చిత్రాలను వేల సంఖ్యలో గీశారు. తాను రాసే ఉత్తరాలకు చిన్న సైజు ప్రకృతి చిత్రాలు జత చేసి పంపేవారు. 1914 జూలై 3న జన్మించిన సంజీవదేవ్ 1999 ఆగస్టు 25న కన్నుమూశారు. ప్రసిద్ధ రచయిత, 'మిథునం' ఫేమ్ శ్రీరమణ, రచయితలు వెనిగళ్ల వెంకటరత్నం, ఎస్‌ఆర్ తపస్విలు నేటితరం కోసమని సంజీవదేవ్ రచనలు, ఆయన జీవితాన్ని ఏర్చికూర్చి 'రసధ్వని'ని తీసుకొచ్చారు. కళాతపస్వి సంజీవదేవ్ అభిమానులకు ఈ పుస్తకం విందుభోజనమే.

## జగ్జీవన్‌రామ్ ఆశయ సాధనకు కృషి



కేక్ కట్ చేస్తున్న విశ్రాంత డీజీపీ కూచిపూడి బాబురావు

**తెనాలిరూరల్:** బాబూ జగ్జీవన్‌రామ్ ఆశయ సాధనకు అందరం కృషి చేద్దామని పలువురు విశ్రాంత అధికారులు, దళిత మేధావులు సూచించారు. భారత మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్(బీజేఆర్) జయంత్యుత్సవం సందర్భంగా తెనాలి బీజేఆర్ జయంత్యుత్సవ నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ఐతానగర్‌లో బుధవారం రాత్రి భారీ బహిరంగ సభను ఏర్పాటు చేశారు. సభకు గూడూరు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ సుద్దపల్లి సుకుమార్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా మధ్యప్రదేశ్ విశ్రాంత డీజీపీ కూచిపూడి బాబురావు మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ సేవలను కొనియాడారు. విద్యతోనే దళిత జాతి అభివృద్ధి సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. విశ్రాంత ఐపీఎస్ అధికారి సీహెచ్ శ్యామ్‌ప్రసాదరావు మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ విలువలు, విశ్వసనీయత నేటి రాజకీయ నేతలకు ఆదర్శమన్నారు. రాష్ట్ర ఎంఈఓల సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రచయిత ఆదూరి వెంకటరత్నం మాట్లాడుతూ అన్ని అర్హతలున్నా జగ్జీవన్‌రామ్ ప్రధాని కాలేకపోయారని, దళితులంతా ఐక్యంగా ఉండి రాజ్యాధికారం సాధించాలని ఆకాంక్షించారు. సామాజిక విశ్లేషకుడు, రచయిత కత్తి కళ్యాణ్ మాట్లాడుతూ సమసమాజ స్థాపనకు పోరాటమే ఏకైక మార్గమన్నారు. ఆచార్య కాకాని సుధాకర్ మాట్లాడుతూ అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్‌లు దళిత సమాజానికి సూర్యచంద్రుల వంటి వారని అభివర్ణించారు. విశ్రాంత డీఐజీ చావలి బాలస్వామి మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ బతికి ఉండగానే ఆయన నిలువెత్తు విగ్రహాన్ని దేశంలోనే తొలిగా తెనాలిలో ప్రతిష్ఠించి ఈ ప్రాంత ప్రజలు ఆయనపై ఉన్న అభిమానాన్ని చాటారని గుర్తు చేశారు. కర్నూలు డెప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ ఉన్న యహెజ్కేల్ మాట్లాడుతూ సమాజంలో అస్పృశ్యత, అంటరానితనాన్ని రూపుమాపాలని, దళితులంతా ఐక్యంగా ఉండాలని సూచించారు. ఆచార్య పొన్నెకంటి రత్నాకర్ మాట్లాడుతూ దేశంలో కరువు తాండవిస్తుండగా హరిత విప్లవాన్ని సృష్టించిన మహనీయుడు జగ్జీవన్‌రామ్ అని కొనియాడారు. బీజేఆర్ జయంత్యుత్సవ కమిటీ ఏర్పాటు చేసిన కేక్‌ను విశ్రాంత డీజీపీ బాబురావు కట్ చేశారు. అలానే 'నవభారత నిర్మాత డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్' పుస్తకాన్ని ఆవిష్కరించారు. కమిటీ సభ్యులు సుద్దపల్లి నాగరాజు, కొమ్ము రాయల్, అత్తోట శరత్, మేకల సురేష్, ఇందుపల్లి రాజారామ్, తెనాలి రాంకీ, అత్తోట చంటి, అత్తోట(వెన్నెల) శ్యామ్, మట్లపూడి రాజేశ్వరరావు, నలుకుర్తి రమేష్ తదితరులు పర్యవేక్షించారు.

**భారీ బైక్ ర్యాలీ..**

జయంత్యుత్సవంలో భాగంగా చెంచుపేట మార్కెట్ యార్డు నుంచి భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. సుమారు మూడు వేల మందికిపైగా బైకలతో ర్యాలీలో పాల్గొన్నారు. ప్రదర్శన చెంచుపేట, ఫ్లైఓవర్, మార్కెట్ వంతెన, కొత్తవంతెన, టెలిఫోన్ ఎక్స్ఛేంజి రోడ్డు, బోస్ రోడ్డు, నెహ్రూ రోడ్డు, రజకచెరువు మీదుగా లింగారావు సెంటరుకు చేరుకుంది. వేలాది వాహనాలు ఒక్కసారిగా రావడంతో ర్యాలీ పూర్తవడానికే సుమారు నాలుగు గంటలకు పైగా సమయం పట్టింది.

## ప్రపంచ తెలుగు సాహితీ బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం



రంగిశెట్టి రమేష్



వినుకొండ శ్రీరామమూర్తి



చందు సూర్య



పి.పద్మజ

**తెనాలి:** తిరుపతిలో ఈనెల 9,10 తేదీల్లో జరగనున్న ప్రపంచ తెలుగు సాహితీ బ్రహ్మోత్సవాలకు పట్టణ, పరిసరాలకు చెందిన పలువురు కవులు, రచయితలకు ఆహ్వానం లభించింది. ఐఎస్‌ఓ గుర్తింపు పొందిన అంతర్జాతీయ సాహిత్య, సాంస్కృతిక, సామాజికసేవాసంస్థ అయిన శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ సారథ్యంలో ఈ ఉత్సవాలు నిర్వహించనున్నారు. రెండురోజుల వేడుకల్లో కవితోత్సవం, సాహిత్య సదస్సులు, కళాప్రదర్శనలలు, పుస్తకావిష్కరణలు జరుగుతాయి. ఈ కార్యక్రమాలకు పట్టణానికి చెందిన కవి, కళాకారులు రంగిశెట్టి రమేష్ (గంగాశ్రీ), వినుకొండ శ్రీరామమూర్తి, లెక్చరర్, కవి చందు సూర్య, కవయిత్రి పి.పద్మజకు ఆహ్వానం లభించింది. సాహితీ బ్రహ్మోత్సవాల్లో వీరు కవితాగానం/కళాప్రదర్శన చేస్తారు. ఇంతకుముందు తెనాలికి చెందిన మరో ముగ్గురికి ఆహ్వానం లభించిన విషయం తెలిసిందే.

## నేడు బాపట్లకు వందే భారత్ రైలు



బాపట్లకు చేరుకోనున్న వందేభారత్ రైలు

**బాపట్లటౌన్:** వందే భారత్ రైలు శనివారం సాయంత్రం 4.50 గంటలకు బాపట్ల రైల్వేస్టేషన్‌కు చేరుకుంటుందని బాపట్ల రైల్వే సూపరింటెండెంట్ కజోడ్ మల్ మీనా, స్టేషన్ మాస్టర్ పాండే తెలిపారు. శుక్రవారం 'సాక్షి'తో వారు మాట్లాడారు. శనివారం ఉదయం 11.30 గంటలకు సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో ప్రధాని నరేంద్రమోదీ చేతుల మీదుగా రైలు ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. అక్కడి నుంచి నల్గొండ, మిరియాలగూడా, పిడుగురాళ్ళ, గుంటూరు, తెనాలి మీదుగా సాయంత్రం 4.50 గంటలకు బాపట్ల చేరుకుంటుందని పేర్కొన్నారు. 4.50 గంటల నుంచి 4.55 గంటల వరకు బాపట్ల రైల్వేస్టేషన్‌లో రైలు నిలుస్తుందని వివరించారు. కొత్తగా ప్రారంభమైన రైలుకు స్వాగతం పలికేందుకు బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి,ఎంపీ నందిగం సురేష్‌ను ఆహ్వానించామని పేర్కొన్నారు. వందేభారత్ రైలు వద్ద ప్రయాణికులు, సందర్శకులు ఫొటోలు, సెల్ఫీలు, వీడియోలు తీసుకునేందుకు వీలుగా ఏర్పాట్లు చేశామని వెల్లడించారు. కళాశాలల విద్యార్థులు రైలులో ఎక్కి ప్రయాణించేందుకు అవకాశం ఉందని వివరించారు.

## పౌరాణిక కళాకారుడు వెంకటేశ్వరరావుకు సన్మానం

**తెనాలిఅర్బన్:** నందమూరి తారకరామారావు శత జయంత్యుత్సవాల్లో భాగంగా పెమ్మసాని థియేటర్‌లో శుక్రవారం సంగీతలక్ష్మి చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. అనంతరం పౌరాణిక నాటక కళాకారుడు ఆలపాటి వెంకటేశ్వరరావును సన్మానించారు. కార్యక్రమంలో యల్లంకి రాధ, నల్లూరి శ్రీనివాస్, కొండముది రమేష్, గురిందపల్లి బుల్లెబ్బాయి, పెమ్మసాని పోతురాజు, డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, సోమవరపు సాంబశివరావు, ఈదర శ్రీనివాసరావు, దేవరపల్లి భవానీ, ఎన్టీఆర్ జగన్, ముప్పనేని రాఘవరావు,గుమ్మడి ప్రసాద్, ముళ్ళపూడి వెంకట్, దాసరి నరసయ్య, చెన్నం సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



వెంకటేశ్వరరావును సన్మానిస్తున్న దృశ్యం


## ప్రభుత్వ వైద్యశాలను సందర్శించిన న్యాయవాదులు

**వినుకొండ టౌన్:** ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని వినుకొండ జూనియర్ సివిల్ జడ్జి ఎ.తౌషిద్ హుస్సేన్ ఆదేశాల మేరకు పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలను బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షులు చాగంటి వీరాంజనేయ చౌదరి ఆధ్వర్యంలో న్యాయవాదులు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా వైద్యశాలలోని వార్డులను పరిశీలించి, ప్రసూతి వార్డులోనున్న బాలింతల క్షేమ సమాచారాన్ని, రోగులకు అందిస్తున్న సేవలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. వారి వెంట వైద్యులు శ్రీనివాసరెడ్డి, బార్ అసోసియేషన్ కార్యదర్శి కొత్త హనుమంతరావు, కోశాధికారి కాకాని నాగేశ్వరరావు, సీనియర్ న్యాయవాదులు ఎంఎస్ ప్రసాద్, నీలం శేఖర్ బాబు, ఎలీషా, అశోక్‌బాబు, సురేష్, ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

## రేపు 'రెండు ఆకాశాల మధ్య' పుస్తక పరిచయం



రచయిత సయ్యద్ సలీం




రెండు ఆకాశాల మధ్య పుస్తకం

**తెనాలి:** విశ్రాంత ఐఆర్‌ఎస్ అధికారి, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత సయ్యద్ సలీం రచించిన 'రెండు ఆకాశాల మధ్య' పుస్తక పరిచయ సభ ఆదివారం తెనాలిలో జరగనుంది. పట్టణానికి చెందిన శ్రీశారదా సాహితీ సాంస్కృతిక సేవాసమితి ఆధ్వర్యంలో కొత్తపేటలోని అదితి గ్రాండ్ హోటల్‌లో ఉదయం 10 గంటలకు నిర్వహించే సభకు దళిత సార్వత్రిక విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి అధ్యక్షత వహిస్తారు. రచయిత సయ్యద్ సలీంతోపాటు పట్టణానికి చెందిన రచయితలు యత్రంశెట్టి హనుమంతరావు, నూతలపాటి నాగేశ్వరరావు, బాలసాహితీవేత్త షేక్ అబ్దుల్ హకీంజాని ప్రసంగిస్తారు. ఆదాయపన్ను శాఖలో అదనపు కమిషనరుగా చేసి, ఐఆర్‌ఎస్‌గా పదోన్నతి పొంది ఉద్యోగ విరమణ చేసిన సయ్యద్ సలీం ప్రవృత్తి రచనా వ్యాసంగం. ఆయన స్వస్థలం ప్రకాశం జిల్లా త్రోవగుంట. తొలికథ 'మనీషి' 1980లో ప్రచురితమైంది. 250పైగా కథలు రాశారు. 'నీలోకి చూసిన జ్ఞాపకం' (1999), 'ఆకులు రాలే దృశ్యం' (2005), 'విషాద వర్షం' (2013) కవితా సంపుటాలు వెలువరించారు. 'సలీం కథలు' దూరదర్శన్‌లో ప్రసారమయ్యాయి. ఇప్పటివరకు 27 నవలలు రచించారు. 'వెండిమేఘం' నవలకు తెలుగు విశ్వవిద్యాలయం సాహితీ పురస్కారం, 'కాలుతున్న పూలతోట'కు కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం లభించాయి. వీరి 52 రచనలు వివిధ భాషల్లోకి అనువాదమయ్యాయి. వీరి రచనలపై పలువురు ఎంఫిల్, పీహెచ్‌డీలు చేశారు.

## చలివేంద్రం ప్రారంభం

**కర్లపాలెం:** వేసవిలో ప్రయాణికుల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయటం అభినందనీయమని ఎస్‌ఐ ఎం.శివయ్య తెలిపారు. కర్లపాలెం సెంటర్‌లో ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శుక్రవారం ఎస్‌ఐ ఎం.శివయ్య ప్రారంభించారు. ప్రయాణికులకు ఆయన తాగునీరు అందించారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ అధ్యక్షుడు పి.నాగభూషిరెడ్డి, ఆటో డ్రైవర్లు తదితరులు ఉన్నారు.

## ప్రపంచ ఆరోగ్య దినోత్సవం

**ఇంటూరు(వేమూరు)** ఆరోగ్యంపై ప్రజలందరూ జాగ్రత్తలు తీసుకోవాలని 11వ అదనపు జిల్లా జడ్జి జి.మాలతి చెప్పారు. అమర్తలూరు మండలంలోని ఇంటూరు గ్రామంలో మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. అందరూ ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం వైద్యులు రోగులకు పరీక్షలు చేశారు. అవసరమైన మందులు అందించారు. కార్యక్రమంలో వైద్యులు కనపర్తి ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.



# జయ యేసు.. శుభ క్రీస్తు

**భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే**



కొలకలూరులో శిలువ యాత్ర



టౌన్‌చర్చిలో ప్రార్థనల్లో పాల్గొన్న పాస్టర్లు



హాజరైన క్రైస్తవులు

**తెనాలిఅర్బన్/తెనాలి టౌన్:** తెనాలి నియోజకవర్గంలో శుక్రవారం గుడ్‌ఫ్రైడేను క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. జయ యేసు.. శుభ క్రీస్తు అంటూ లోకరక్షకుడిని కీర్తించారు. గుడ్‌ఫ్రైడే సందర్భంగా టౌన్‌చర్చిలో శుక్రవారం ఉదయం నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. దైవ సేవకులు క్రీస్తు సందేశం అందించారు. శిలువపై యేసు పలికిన ఏడు మాటలను వివరించారు. కార్యక్రమంలో రెవరెండ్ దేవరపల్లి యేసురత్నం, రెవరెండ్ దగ్గుమల్లి సాల్మాన్ రాజు, దగ్గుమల్లి ఏలియాకుమారి సాల్మన్, రెవరెండ్ యామర్తి లెనిన్‌బాబు, దేవరపల్లి జయప్రద యేసురత్నం, పాస్టర్ యామర్తి రోజ్‌లీనా లెనిన్, రెవరెండ్ మత్తె విజయభాస్కర్ ప్రకాష్‌బాబు పాల్గొన్నారు.

- మారీసుపేటలోని ఫిలదెల్ఫియా చర్చిలో పాస్టర్ చిలువూరి నతానియేలు వాక్యపరిచర్య చేశారు. శిలువలో పలికిన ఏడు మాటలను సంఘ పెద్దలు కూచిపూడి నీలాంబరం, పినపాటి స్టీవెన్‌బాబు, జంగం జానీ తదితరులు వివరించారు.
- మారీసుపేటలో రాక్ గాస్పెల్ చర్చిలో గుడ్‌ఫ్రైడే సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. శిలువలో పలికిన ఏడు మాటలను బిషప్ పినపాటి జాన్‌పాల్ వివరించారు.
- ఇస్లాంపేటలోని యేసయ్య ప్రార్థన కొండ చర్చిలో బ్రదర్ ఆనందన్న ప్రత్యేక సందేశాన్ని ఇచ్చారు.
- పట్టణంలోని పలు బాప్టిస్ట్ చర్చిలు, లూథరన్ చర్చిలు, హోసన్నా చర్చిలు, బైబిల్ మిషన్ చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఆయా చర్చిలకు చెందిన పాస్టర్లు వాక్యపరిచర్య చేశారు.
- కొలకలూరులోని ఆర్సీఎం చర్చిలో ఫాదర్ సాగర్ థామస్ క్రీస్తు ప్రభువు అనుభవించిన శ్రమలకు సాదృశ్యంగా శిలువను మోస్తూ ప్రార్థనలు ప్రారంభించారు. యేసుక్రీస్తు శిలువ మీద పలికిన ఏడు మాటలను ధ్యానించారు. వాక్యోపదేశం చేశారు. భక్తులకు మజ్జిగ, పానకం అందజేశారు. జూబ్లీ స్కూల్ సిస్టర్స్, ఉపదేశి, సంఘపెద్దలు, మహిళలు, యువకులు, చిన్నారులు పాల్గొన్నారు. తెలుగు బాప్టిస్టు చర్చిలో గుడ్‌ఫ్రైడే ప్రార్థనలు జరిపారు. పాస్టర్ నన్నెపాగ సురేష్ ప్రార్థనలు చేశారు. మండలంలోని నందివెలుగు, కొలవరం, కంచర్లపాలెం, గుడివాడ, కోపల్లె గ్రామాల్లోని చర్చిలలో గుడ్‌ఫ్రైడే ప్రార్థనలు జరిపారు.